పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఉద్యోగులు

సైదాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ స్కీమ్‌ ఉద్యోగుల సంఘం ప్రతినిధి, సైదాబాద్‌ మండలం డిప్యూటీ తహసీల్దార్‌ పి.కిరణ్‌కుమార్‌ కోరారు. చంపాపేటలోని సైదాబాద్‌ మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రెవెన్యూ ఉద్యోగులతో కలిసి సంఘం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పెన్షన్‌ విధానం సీపీఎస్‌తో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు కనీస అవసరాలకు కూడా సరిపోనంత అతి తక్కువ మొత్తాన్ని నెలవారీ పెన్షన్‌గా పొందుతున్నారని తెలిపారు. కష్టపడి ఉద్యోగం సంపాదించి సమర్థవంతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ తర్వాత సీపీఎస్‌ పెన్షన్‌ విధానం ద్వారా వృద్ధాప్యంలో అరకొర పెన్షన్‌తో ఇబ్బందులు పడాలా అని ప్రశ్నించారు. తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ స్కీమ్‌ ఉద్యోగుల సంఘం చేసే పోరాటానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు శ్రీనివాస్‌రెడ్డి, అమల, అర్చన, స్పెషల్‌ ఆర్‌ఐ జగదీశ్వర్‌రావు, సీనియర్‌ అసిస్టెంట్లు రవికిరణ్‌, వెంకటగిరి, నాగ శిరీష, భాగ్యలక్ష్మి, నిర్మల, సుధ, రాములు, రవి, రాజు, రవీందర్‌, హరీష్‌ పాల్గొన్నారు.

'అవార్డుల ఎంపికలో అంధులకు అన్యాయం'

చాదర్‌ఘాట్‌: ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డుల ఎంపికలో అంధులు, ఇతర వైకల్యం గల అభ్యర్థులకు అన్యాయం జరిగిందని అంధుల అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి చిందాల శ్రీశైలం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన 21 రాష్ట్రస్థాయి అవార్డులలో శారీరక వికలాంగ అభ్యర్థులకు 15, బధిర అభ్యర్థులకు 3 అవార్డులు ఇవ్వడం జరిగిందని, అంధులకు ఇతర 19 రకాల వైకల్యం గల అభ్యర్థులకు ఒక అవార్డును కేటాయించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులు అందరిని సమానంగా చూడాల్సిన ప్రభుత్వం అవార్డులలో 90 శాతం కేవలం శారీరక వికలాంగులకు ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. అవార్డుల ఎంపిక కమిటీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం జరిగిందని విమర్శించారు. అవార్డుల ఎంపికలో జరిగిన అన్యాయంపై విచారణ జరిపించి అవార్డుల విలువలను కాపాడాలని దివ్యాంగ సంఘాల నేతలు కోరారు.



పోస్టర్‌ ఆవిష్కరణ

లింగోజిగూడ: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన తర్వాత ఆటో డ్రైవర్ల జీవన ఉపాధి దెబ్బతిందని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, ట్రాన్స్‌పోర్టు యూనియన్‌ అధ్యక్షుడు రాములు తెలిపారు.ఆటో ట్యాక్సీ, క్యాబ్‌ల రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15 వేలు అందించాలని, రవాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.నగరంలో కొత్త ఆటోలకు పర్మిట్లను ఇవ్వటంతో పాటు ఓలా, ఉబర్‌ ద్వారా నడుస్తున్న ద్విచక్ర వాహనాలను నిషేధించాలని డిమాండ్‌ చేశారు. నగరంలో ఆటో మీటర్‌ ఛార్జీలను పెంచడంతో పాటు థర్డ్‌ పార్టీ ఇన్సూరెన్స్‌ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ప్రమాద భీమాను రూ.10 లక్షలకు పెంచి, సాధారణ మరణాలకు కూడా అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2019 మోటారు వాహనాల చట్టాని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. ఆటోలు, క్యాబ్‌ల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని, ప్రస్తుతం నడుస్తున్న రవాణ యాప్‌లను రద్దు చేసి ప్రభుత్వపరమైన ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, ఇమ్మానియెల్‌, కృష్ణమూర్తి, గోపి, రమేష్‌, రాజమౌళి పాల్గొన్నారు.

చెత్తతో విద్యుత్‌ తయారీపై అవగాహన



చెత్తతో విద్యుత్‌ తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లింగోజిగూడ: విద్యార్థి దశ నుంచే వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే వారు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణిస్తారని లింగోజిగూడ కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్యక్రమంలో భాగంగా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌ ఉన్నత పాఠశాల 8, 9వ తరగతి విద్యార్థులకు జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డులో చెత్తతో విద్యుత్‌ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కిల్‌ డెవలప్‌మెంట్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు భవిష్యత్‌లో కొంతైనా ఉపయోగపడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాంకీ సిబ్బంది వేణు, కృష్ణ, ఉపేందర్‌, నాయకులు శ్రీధర్‌గౌడ్‌, ప్రవీణ్‌రెడ్డి, నరేష్‌ ముదిరాజ్‌, రోహిత్‌, నరేందర్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బైరామల్‌గూడ ఓల్డ్‌ బస్తీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన సర్కిల్‌ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. చంపాపేట డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలలో ఇప్పటికే ప్రారంభించిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. రోడ్ల మధ్యన ఉన్న కాలం చెల్లిన విద్యుత్‌ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్‌ వెంట సర్కిల్‌ ఏఈ సురేష్‌, జలమండలి మేనేజర్‌ రమ్యభారతి, సిబ్బంది శ్రీహరి, నాయకులు శ్రవణ్‌కుమార్‌, వెంకటేష్‌ ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

మన్సూరాబాద్‌: డివిజన్‌ పరిధి సహారా స్టేట్స్‌కాలనీలోని శ్రీలలితా నాగలింగేశ్వరస్వామి దేవాలయ హుండీని గురువారం ఆలయ అడ్‌హక్‌ కమిటీ సభ్యులు భక్తుల సమక్షంలో లెక్కించగా రూ.1,26,205 ఆదాయం సమకూరిందని సభ్యులు తెలిపారు. సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగి స్వయంభూ శివాలయంలో భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. లెక్కింపులో ఆలయ అడ్‌హక్‌ కమిటీ సభ్యులు తులసమ్మ, మేకల వెంకట్‌రెడ్డి, కాలనీ మెయింటనెన్స్‌ కమిటీ కోశాధికారి శేఖరయ్య, కాలనీవాసులు ప్రకాష్‌, గంగదాసు కృష్ణారెడ్డి, ప్రసాద్‌ పాల్గొన్నారు.

సర్వే పూర్తయిందంటున్న అధికారులు
స్టిక్కరే వేయలేదంటున్న ప్రజలు

- ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో నత్తనడక సర్వే
- అపార్ట్‌మెంట్లు, సంక్షేమ సంఘాల బహిష్కరణ

ఎల్‌బీనగర్‌: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ పరిధిలో వందశాతం సమగ్ర సర్వే పూర్తి చేశామని అధికారులు తెలుపుతున్నా.. పలువురు మాత్రం తమ ఇంటికి ఇంకా ఎవరూ రాలేదని కనీసం స్టిక్కర్‌ కూడా వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివారు కాలనీల్లో కనీసం సిబ్బంది కనిపించిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం అందుబాటులో ఉన్న వారి సర్వే పూర్తిచేసి వివరాలు నమోదు చేశామని, మరికొందరు అందుబాటులో లేకపోవడంతో పాటు పలువురు తమ సొంత ఊర్లలో వివరాలు నమోదు చేసుకున్నారని చెబుతున్నారు. ప్రతిపక్షాలు మాత్రం ప్రజలను పక్కదోవ పట్టించేందుకే సర్వే పేరుతో మభ్యపెడుతున్నారని ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారు.



శివారు కాలనీల్లో కనిపించని సిబ్బంది..

హయత్‌నగర్‌ సర్కిల్‌, ఎల్‌బీనగర్‌ సర్కిళ్ల పరిధిలోని శివారు కాలనీల్లో సర్వేకు రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముందుగా సమాచారం ఇవ్వకపోవడంతో చాలా మంది తమ తమ పనులకు వెళ్లిపోతున్నారని ఆ సమయంలో వచ్చి డోర్‌లాక్‌ అంటూ అధికారులు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదో మొక్కుబడిగా చేసే సర్వే ఎందుకని ప్రశ్నిస్తున్నారు. అధికారులు తెలుపుతున్న వివరాలకు చేసిన సర్వేకు పొంతన లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కులగణ సర్వేను పలు కాలనీలు, అపార్ట్‌మెంట్‌ వాసులు బహిష్కరించినట్లు పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కనీసం అపార్ట్‌మెంట్‌ లోపలలికి రానివ్వలేదని, పలు కాలనీలో సంక్షేమ సంఘాలు సైతం సర్వేను బహిష్కరించారని తెలిసింది.

సర్వే వివరాలిలా..

సరూర్‌నగర్‌ సర్కిల్‌ పరిధిలో: 5 డివిజన్లలో మొత్తం ఇళ్లు 65,627 ఉండగా అందులో 55,764 ఇళ్లను సర్వేచేశారు. ఇతర ప్రాంతాల్లో వివరాలు ఇచ్చిన వారి సంఖ్య 6318 గృహస్తులు ఉండగా 434 ఇళ్లకు తాళాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ పరిధిలో: 4 డివిజన్లలో మొత్తం 71,948 నివాస గృహాలు ఉండగా అందులో 65,922 ఇళ్ల సర్వే పూర్తి చేశారు.ఇతర ప్రాంతాలలో వివరాలు ఇచ్చిన వారిలో 2041 గృహస్తులు ఉండగా 1588 ఇళ్లకు తాళాలు ఉన్నట్లు చెబుతున్నారు.

హయత్‌నగర్‌ సర్కిల్‌ పరిధిలో: 4 డివిజన్లలో మొత్తం 84,617 నివాస గృహాలు ఉండగా 74,651 ఇళ్ల సర్వేను పూర్తి చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు.6491 గృహస్తులు ఇతర ప్రాంతాలలో వివరాలు ఇవ్వగా 4382 ఇళ్లకు తాళాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ.30, వంకాయ రూ. 23, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 25, కాకర రూ. 20, బీర రూ. 32, క్యాబేజి రూ. 23, ఫ్రెంచిబీన్స్‌ రూ. 28, క్యారట్‌ రూ. 45, దొండ రూ. 23–28, చిక్కుడు రూ. 35, గోకర రూ. 23, బీట్‌రూట్‌ రూ. 43, క్యాప్సికం రూ. 58, ఆలు రూ. 35, దోస రూ. 23, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 13, ఉల్లిగడ్డ రూ. 44, చామగడ్డ రూ. 35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గుర్రపు డెక్క తొలగింపు

మన్సూరాబాద్‌: మన్సూరాబాద్‌ పెద్ద చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో ఈఎఫ్‌ఏ జనార్దన్‌ ఆధ్వర్యంలో గురువారం పనులు చేపట్టారు.

కలెక్టర్‌ చొరవతో బధిరుల పాఠశాలలో నల్లా కనెక్షన్‌

చాదర్‌ఘాట్‌: గత కొన్ని ఏళ్లుగా మలక్‌పేటలోని మూగ, చెవిటి బధిరుల ఉన్నత పాఠశాలలో మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా వెంటనే సంబంధిత జలమండలి అధికారులకు నల్లా కనెక్షన్‌ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో జలమండలి డీజీఎం హస్మత్‌అలీ ఆధ్వర్యంలో నల్లా కనెక్షన్‌కు పనులు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తాగునీటి సమస్య తీరినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటయ్య మరణం పార్టీకి తీరని లోటు

నాగోలు: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాగోలు డివిజన్‌ జైపురికాలనీ ఫేస్‌–1 శాఖ సీనియర్‌ నాయకులు వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ మేడ్చల్‌ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. జైపురికాలనీలో నివాసముండే వెంకటయ్య రాత్రి అకాల మరణం బాధాకరమన్నారు. గురువారం పార్టీ పతాకాన్ని ఆయన పార్థివదేహంపై ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం నిరంతరం పనిచేసిన నాయకుడు వెంకటయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో బాతరాజు నర్సింహా, శ్యామల యాదగిరి, భూపతి సురేష్‌, యాదగిరి, శ్రీధర్‌ రెడ్డి, లక్ష్మణ్‌, బాల రాజు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్‌

సైదాబాద్‌: ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ దిగుమతి చేసుకుని విక్రయిస్తున్న యువకులను సైదాబాద్‌ పోలీసులు గురువారం జైలుకు తరలించారు. ఎస్సై శివశంకర్‌ వివరాల ప్రకారం.. సైదాబాద్‌కు చెందిన సాయి తేజ(27) మధుసూదన్‌(30) బెంగళూర్‌ నుంచి డ్రగ్స్‌ను కొరియర్‌ ద్వారా తెప్పించి స్థానిక ప్రజలకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం నిందితుల ఇంటిపై దాడులు చేయగా 28.5 గ్రాముల డ్రగ్స్‌ దొరకడంతో ఇద్దరిని జైలుకు తరలించామన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే పనుల్లో ఆలస్యం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



స్విమ్మింగ్‌ పూల్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: అధికారుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోపించారు. హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని జయక్రిష్ణ ఎన్‌క్లేవ్‌ కాలనీలో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్‌ స్విమ్మింగ్‌పూల్‌, షటిల్‌కోర్టు, ఇండోర్‌జిమ్‌ పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నియోజకవర్గంలో నివసిస్తున్నారని రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 3 వేల చదరపు గజాల స్థలంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్‌ స్విమ్మింగ్‌పూల్‌ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. దీనికి రూ. 8 కోట్లు ఖర్చవుతుందని ప్రతిపాదనలు పంపించామని మొదటి విడతగా రూ. 5 కోట్లు విడుదల చేశామని ఈ పనులు పూర్తయితే మిగతా డబ్బులు వెంటనే మంజూరు చేయిస్తామన్నారు. కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గోదల రఘుమారెడ్డి, రమావత్‌ శ్రీనివాస్‌నాయక్‌, సయ్యద్‌పాషా పాల్గొన్నారు.

సకాలంలో స్పందించి.. ఆస్పత్రికి తరలించి..



మహిళను అంబులెన్స్‌లో తరలిస్తున్న ఆర్‌ఎస్సై రాము

మలక్‌పేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పలువురిని మలక్‌పేట ట్రాఫిక్‌ పోలీసులు సకాలంలో స్పందించి ఆసుపత్రికి తరలించారు. మూసారంబాగ్‌ కోణార్క్‌ టవర్స్‌ సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్‌ క్రేన్‌ ఆర్‌ఎస్సై రాము, సిబ్బంది ప్రమాద జరిగిన స్థలానికి చేరుకుని వారికి ప్రథమ చికిత్స అందించారు. 108 అంబులెన్స్‌కు ఫోన్‌ చేసి గాయపడిన ఓ మహిళ, మరో ఇద్దరు వ్యక్తులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సామాజిక బాధ్యతగా స్పందించి ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన ఆర్‌ఎస్సై రాము, సిబ్బందిని ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌కుమార్‌, స్థానికులు అభినందించారు.

సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేర్చాలి



యూనుస్‌ను సన్మానిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వద్దకు చేర్చాలని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి సూచించారు. సరూర్‌నగర్‌ డివిజన్‌ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా గెలుపొందిన యూనుస్‌ గురువారం దేప భాస్కర్‌రెడ్డిని కలువగా ఆయన శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యూత్‌ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్‌ నేత, ఉపేందర్‌ రెడ్డి, ధనరాజ్‌ గౌడ్‌, భూపాల్‌ రెడ్డి, ఇమ్రాన్‌షఫీ, జంగారెడ్డి, అజీజ్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

చంపల్‌గూడ: ఇటీవల జరిగిన మాలల సింహగర్జనలో మాదిగలపై పలువురు ఇష్టానుసారంగా మాట్లాడారని మాదన్నపేట మాదిగ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మాదన్నపేటలోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును తప్పుపడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్గీకరణతో అన్ని ఉప కులాల వారికి మేలు జరుగుతుందన్నారు. మాల సంఘాల నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్‌ పార్టీ శాసన సభ్యుడు గడ్డం వివేకానందపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. శివకుమార్‌గౌడ్‌, సుదర్శన్‌, రవీందర్‌, నర్సింగ్‌రావు, మహేష్‌, నారాయణ, పాండు, శరత్‌ పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్‌



సభలో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని బీజేపీ భాగ్యనగర్‌జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం రాత్రి మలక్‌పేటలో బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సలీంనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి సర్కార్‌ కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణ, మాజీ డిప్యూటీ మేయర్‌ సుభాష్‌చందర్‌, రమేష్‌రెడ్డి, హరిగౌడ్‌, దేవేందర్‌, గజానంద్‌, భరత్‌కుమార్‌ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



పైప్‌లైన్‌ పనులు ప్రారంభిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్‌: ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్‌ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్‌ కాలనీలో నూతనంగా నిర్మించనున్న 100 ఎంఎం వాటర్‌ పైప్‌లైన్‌ నిర్మాణ పనులను గురువారం ఆమె అధికారులు, కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డివిజన్‌ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్‌ డీజీఎం సన్యాసిరావు, మేనేజర్‌ రమ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా



చెక్కులు అందజేస్తున్న మధుయాష్కీ గౌడ్‌

ఎల్‌బీనగర్‌: సీఎంఆర్‌ఎఫ్‌ పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ అన్నారు.ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను గురువారం మధుయాష్కీగౌడ్‌ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే కాంగ్రెస్‌ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్‌ జి.వెన్నెల, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా విద్య, వైద్యం అందించాలి

నాగోలు: రాష్ట్ర ప్రజలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలని విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు యెచ్చు సునీల్‌ అన్నారు. ఉచిత విద్య, వైద్యం అందించాలని ఇంటింటికి తిరిగి గురువారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్‌ మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్భవించిన విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత విద్య వైద్యం అందించాలని ఉద్దేశంతో కార్యచరణ మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా కార్పొరేట్‌ స్కూల్స్‌, ఆస్పత్రుల్లో ఉచిత విద్యా, వైద్యం అందించడమే లక్ష్యంగా విద్యార్థుల రాజకీయ పార్టీ పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోకికర్‌ అనిల్‌, నందాల అనిల్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణల తొలగింపు



మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం ఫుట్‌పాత్‌ ఆక్రమణలను తొలగించారు. మలక్‌పేట, రైస్‌మిల్లర్స్‌ చౌరస్తా, అక్బర్‌బాగ్‌ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల పై ఉన్న డబ్బాలు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారాలను తొలగించారు. ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌ కుమార్‌ మాట్లాడుతూ.. నగర సీపీ ఆదేశాల మేరకు ఫుట్‌పాత్‌ ఆక్రమణలు తొలగిస్తున్నామని ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా, పాదచారులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌ ఎస్సైలు రామస్వామి, వినోద్‌, ఆర్‌ ఎస్సై రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో కార్తీక భోజనాల సందడి



బహుమతులు అందజేస్తున్న కృష్ణమూర్తి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్‌–2 డిస్ట్రిక్‌ డిపోలో గురువారం కార్తీక వన భోజనాలతో సందడి చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి టెన్నిస్‌, షటిల్‌, మ్యూజికల్‌ చైర్‌ తదితర ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి మేనేజర్‌ కృష్ణమూర్తి బహుమతులు అందజేశారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఏఎంటీ ఉషశ్రీ, ఏఎంఎఫ్‌ సతీష్‌, ఎస్‌టీఐ రమాదేవి, డిప్యూటీ ఎస్‌డీపీటీ ఉమాపతి పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి



రిక్షాలను అందజేస్తున్న కార్పొరేటర్‌ సుజాతానాయక్‌

హస్తినాపురం: తడి,పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని హస్తినాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. డివిజన్‌ వార్డు కార్యాలయంలో గురువారం ఆరు చెత్తా రిక్షాలను కార్పొరేటర్‌ కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లు, ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదన్నారు. ఇష్టానుసారంగా చెత్త పారబోస్తుండటంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడేస్తాయన్నారు. పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్‌ శంకర్‌, నాయకులు రాజుగౌడ్‌, చందు, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.